ప్రజాశక్తి

మంగళవారం 15 జులై 2025

జెఎన్‌టియులో సర్టిఫికెట్ కోర్సు ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జెఎన్‌టియు విజయనగరంలో సర్టిఫికెట్ కోర్సు ఇన్ ఎమర్జింగ్ టెక్నాలజీ అనే అంశంపై ఆన్‌లైన్ పోస్టర్‌ను సోమవారం రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్. కె. మధుమూర్తి విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కె. మధుమూర్తి మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మిషన్ లెర్నింగ్ లాట్ సైబర్ సెక్యూరిటీ క్వాంటం కంప్యూటింగ్ అనే అంశాలకు చాలా ప్రాముఖ్యత ఉందని, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఈ కోర్సులు ఉపయోగపడతాయన్నారు. ఈ సర్టిఫికేషన్ కోర్స్ ను లాంచ్ చేయడం జెఎన్‌టియు జివి తీసుకున్న మంచి నిర్ణయమని అన్నారు. జెఎన్‌టియు జివి విద్యార్థులు ఈ టెక్నాలజీని అంది పుచ్చుకుని వాటిని సమర్థవంతంగా నిర్వహించే విధంగా తీర్చి దిద్దాలని ఉద్బోధించారు. ఇన్‌ఛార్జి వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్ డి. రాజ్యలక్ష్మి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి. జయసుమ, ఫ్యాకల్టీ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎం. హేమ తదితరులు పాల్గొన్నారు.

అశోక్‌కు అరుదైన గౌరవం

- గోవా గవర్నర్‌గా నియామకం
- బంగ్లాలో మిన్నంటిన సంబరాలు
- టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానుల హర్షం
- పదవుల కోసం పరితపించలేదు : అశోక్

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి/ కోట

టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజుకు అరుదైన గౌరవం లభించింది. గోవా రాష్ట్ర గవర్నర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం నియామక ఉత్తర్వులు రావడంతో అశోక్ బంగ్లా (జిల్లా టిడిపి కార్యాలయం)లో సంబరాలు మిన్నంటాయి. బాణాసంచా పేల్చారు. పార్టీ కార్యకర్తలు, అశోక్ అభిమానులు కోలాహలం నడుమ స్వీట్లు పంచారు. అశోక్‌కు గవర్నర్ పదవి వరించడం పట్ల హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. అశోక్ రాజకీయ చరిత్రపై చర్చ జరిగింది. టిడిపి పుట్టుక నుంచి అశోక్ అదే పార్టీలో ఉన్నారు. అంతకు ముందు 1978లో జనతా పార్టీలో చేరి ఒకసారి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. టిడిపి ఆవిర్భావం తరువాత మరో ఆరు సార్లు ఎమ్మెల్యే, ఒకసారి విజయనగరం ఎంపీగా విజయం సాధించారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులుగా పనిచేశారు. ఇప్పటికీ జిల్లా పార్టీకి ఆయన నివాసం (అశోక్ బంగ్లా) కేరాఫ్ అడ్రస్‌గా కొనసాగుతోంది. గత ఎన్నికల సందర్భంలోనే ప్రత్యక్ష రాజకీయాల నుంచి తప్పుకున్నారు. తన కుమార్తె అదితి విజయలక్ష్మికి టిక్కెట్ ఇప్పించి గెలిపించారు. క్రమశిక్షణ గల నాయకుడిగా, పార్టీకి విధేయత గల నేతగా ముద్రవేసుకున్నారు. ఇప్పటికీ జిల్లాలో ఆయన మాటకు విలువ ఉంటుంది. ఎన్నికల్లో సీట్లు కేటాయింపు మొదలుకుని, పార్టీ కార్యకలాపాల వరకు అశోక్ కనుసన్నల్లో సాగుతుండడంలో సందేహం లేదు. ఇవన్నీ నేటి గవర్నర్ పదవి రావడానికి కలిసొచ్చిన అంశాలని పార్టీ నాయకుల్లో చర్చనడుస్తోంది.

పదవుల కోసం పరితపించలేదు : అశోక్

గోవా గవర్నర్‌గా నియమితులైన అశోక్‌గజపతిరాజు సోమవారం సాయంత్రం టిడిపి కార్యాలయమైన తన బంగ్లాలో మీడియాతో మాట్లాడారు. తానెప్పుడూ పదవులను పరితపించలేదన్నారు. పదవులు వచ్చిన తరువాత బాధ్యతగా పనిచేయడమే తన సిద్ధాంతమన్నారు. గవర్నర్‌గా నా పేరును చంద్రబాబు ప్రతిపాదించడం అదృష్టంగా భావిస్తున్నానని, గవర్నర్‌గా ఎంపిక చేసిన ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి కృతజ్ఞతలు తెలిపారు. గతంలో మోడీ ప్రభుత్వంలో సివిల్ ఏవియేషన్ మంత్రిగా పనిచేసే అవకాశం లభించిందన్నారు. మళ్లీ దేశానికి సేవ చేసే అవకాశం వచ్చిందన్నారు. గోవా పర్యాటకంగా బాగా అభివృద్ధి చెందిన రాష్ట్రమని, స్వాతంత్య్రం తర్వాత భారత్‌లో చేరిన రాష్ట్రాల్లో గోవా ఒకటని తెలిపారు. రాజ్యాంగం ప్రకారమే ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు. తెలుగువాడిగా మరింత బాధ్యత పెరిగిందన్నారు. అంతర్జాతీయంగా తెలుగు వారు తెచ్చిన గౌరవాన్ని నిలబెట్టడం తన బాధ్యతన్నారు. ఇప్పటికే ప్రత్యక్ష రాజకీయాల్లో రిటైర్మెంట్ తీసుకున్నానని, ఎక్కడికి వెళ్లినా, ఎంత ఎత్తుకు ఎదిగినా విజయనగరం పట్టణాన్ని మర్చిపోనని అన్నారు. మంచి రోజు చూసుకొని త్వరలోనే ప్రమాణ స్వీకారం చేస్తానని తెలిపారు.

అశోక్‌కు అభినందనలు తెలిపేందుకు వచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలు

అభినందనల వెల్లువ

గోవా గవర్నర్‌గా నియమితులైన అశోక్‌గజపతిరాజుకు అభినందనలు వెల్లువెత్తాయి. విషయం తెలుసుకున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున అశోక్‌బంగ్లాకు తరలివచ్చారు. ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, పార్టీ జిల్లా అధ్యక్షులు, డిసిసిబి చైర్మన్ కిమిడి నాగార్జున, పలువురు ఎమ్మెల్యేలు, నాయకులు, కార్యకర్తలు వచ్చి అశోక్‌గజపతిరాజుకు శుభాకాంక్షలు తెలిపారు. బాణా సంచాలు వెలిగించి, స్వీట్లు పంచుకున్నారు. ఈ సందర్భంగా వారందరికీ అశోక్‌గజపతిరాజు ధన్యవాదాలు తెలిపారు.

50ఏళ్ల రాజకీయ జీవితంలో మచ్చలేని మనిషి : అదితి

అశోక్‌గజపతిరాజు 50ఏళ్ల రాజకీయ జీవితంలో మచ్చలేని మనిషి అని, ఉత్తరాంధ్ర రాజకీయాలకు తండ్రి లాంటివారని ఎమ్మెల్యే పి.అదితి విజయలక్ష్మి గజపతిరాజు అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తన తండ్రి అశోక్ గజపతిరాజు 50ఏళ్ల రాజకీయ జీవితంలో ఎన్నో పదవులు అలంకరించారని అన్నారు ఆయనకి పదవి రావడం ఎంతో ఆనందదాయకంగా ఉందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని కోరుకుంటున్నామన్నారు.

మీడియాతో మాట్లాడుతున్న అశోక్‌గజపతిరాజు

కేంద్రమంత్రి పియూష్ గోయల్ నుంచి అవార్డు అందుకుంటున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్

ఒడిఒపి అవార్డు అందుకున్న కలెక్టర్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

విజయనగరం జిల్లా కీర్తి దేశరాజధానిలో రెపరెపలాడింది. ఒన్ డిస్ట్రిక్ట్... ఒన్ ప్రొడక్ట్ (ఒడిఒపి) అవార్డుకు బొబ్బిలి వీణ మొదటి బహుమతికి ఎంపికకాగా, జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రాజధానిలో ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఓడి ఓపి అవార్డుకు రాష్ట్రం నుంచి 7 జిల్లాలకు చెందిన ఉత్పత్తులు ఎంపికవ్వగా, మన బొబ్బిలికి చెందిన జ్ఞాపిక వీణ మొదటి బహుమతికి ఎంపిక కావడం జిల్లాకు గొప్ప గుర్తింపు నిచ్చింది. జిల్లా కేటగిరీల్లో విజయ నగరం బొబ్బిలి వీణ, బాపట్ల పట్టుచీరలు, వెంకటగిరి చీరలు సంయుక్తంగా మొదటి బహుమతిని అందుకున్నాయి. మొత్తం నాలుగు కేటగిరీల్లో బహుమతులను అందజేశారు. కొత్తఢిల్లీ ప్రగతి మైదానంలోని భారత్ మండపంలో సోమవారం జరిగిన పురస్కార ప్రధానోత్సవ కార్యక్రమంలో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖామంత్రి పియూష్ గోయల్ చేతులమీదుగా, ఒడిఒపి అవార్డును కలెక్టర్ అంబేద్కర్ అందు కున్నారు. ఈ కార్యక్రమంలో ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖాగుప్తా, ఆ రాష్ట్ర వాణిజ్య, పరిశ్రమల శాఖా మంత్రి జితిన్ ప్రసాద, ఆంధ్రప్రదేశ్ బిసి సంక్షేమ, చేనేత జౌళిశాఖామంత్రి ఎస్.సవిత, పరిశ్రమలశాఖ చీఫ్ సెక్రటరీ ఆర్‌పి శిసోడియా, చేనేత జౌళిశాఖ కమిషనర్ జి.రేఖారాణి, జిల్లా చేనేత జౌళిశాఖాధికారి ఆర్‌వి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు. అరుదైనఈ పురస్కారాన్ని అందుకున్న కలెక్టర్ అంబేద్కర్‌కు ఈ సందర్భంగా పలువురు అభినందనలు తెలిపారు.

వెయిట్ లిఫ్టర్ భవానీకి ఘన స్వాగతం

కంటోన్మెంట్ : తాజాగా కజకిస్తాన్‌లో జరిగిన ఏషియన్ యూత్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో మూడు బంగారు పథకాలు సాధించి విజయనగరం చేరుకున్న రెడ్డి భవానికి సోమవారం సాయంత్రం కొండకరకాం గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. గ్రామ పెద్దలు కిలారి రాంబాబు, పాండ్రంకి గౌరినాయుడు ,రాంబర్కి రామునాయుడు, చింతపల్లి సురేష్ ఆధ్వర్యంలో గ్రామస్తులు భారీగా రైల్వే స్టేషన్ కి చేరుకొని భవానికి ఘన స్వాగతం పలికారు. శాలువ కప్పి ఘనంగా సత్కరించారు. రైల్వే స్టేషన్ నుంచి టాపు లేని జీపుపై ఎత్తి బ్రిడ్జి, అశోక్ బంగ్లా, ఆర్అండ్‌బి, కలెక్టర్ ఆఫీస్, అర్‌టిఒ ఆఫీసు మీదుగా మోటార్ బైక్‌ల ర్యాలీతో గ్రామానికి తోడ్కొని వెళ్లారు.

పట్టుకున్న గంజాయి, నిందితులతో ఎస్‌పి వకుల్‌జిందాల్, పోలీసు అధికారులు

230 కిలోల గంజాయి పట్టివేత

ఇద్దరు నిందితులు అరెస్టు.. మరో ముగ్గురు పరారీ

ప్రజాశక్తి-కంటోన్మెంట్

ఒడిశా నుంచి విశాఖకు రెండు కారుల్లో తరలిస్తున్న 230 కిలోల గంజాయిని మానాపురం రైల్వేగేటు వద్ద ఈగల్, మానాపురం పోలీసులు పట్టుకున్నారు. ఈమేరకు సోమవారం జిల్లాపోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్ వివరించారు. ఈనెల 13న పోలీసులకు, ఈగల్ బృందానికి వచ్చిన ఖచ్చితమైన సమాచారంతో మానాపురం గేటు వద్ద వాహన తనిఖీలు చేపట్టి, రెండు కారుల్లో ఒడిశా రాష్ట్రం పొట్టంగి నుండి విశాఖపట్నం తరలిస్తున్న 230కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్‌పి తెలిపారు. పరారీ అయిన మరో ముగ్గురు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపడుతున్నామన్నారు. రెండు కార్లలో వస్తున్న ఐదుగురు వ్యక్తులు పోలీసులను చూచి, కార్లను విడిచి పారిపోయేందుకు ప్రయత్నించారన్నారు. పోలీసులు వారిని వెంబడించి కోరాపుట్ జిల్లా పొట్టంగి మండలం పదం పంచాయతీ జంగరాద గ్రామానికి చెందిన ఘాసిరాం హంతల్ (24), కోరాపుట్ జిల్లా సిమిలిగూడ మండలం దబాయిగూడ పంచాయతీ, ఝులియగూడ గ్రామానికి చెందిన కరన్ ఖిలో (24)ను అదుపులోకి తీసుకున్నారన్నారు. వీరిని విచారణ చేయగా పరారైన ముగ్గురు సురేష్ అదకాబీయా, ఖనిలతి, జున్నేష్‌గా గుర్తించామని, వీరిలో సురేష్ క్రియాశీలకమైన నిందితుడని తెలిపారు. అదుపులోకి తీసుకున్న ఇద్దరు నిందలను ఖరెస్టు చేసి, రెండు కార్లును, 44 ప్యాకెట్లులో ఉన్న 230కిలోల గంజాయి, రూ.700 నగదు, మూడు మొబైల్ ఫోన్లను సీజ్ చేసామన్నారు. గంజాయి అక్రమ రవాణను తీవ్రంగా పరిగణిస్తున్నామని, కారకులైన వారిని కేసుల్లో నిందితులుగా చేర్చుతున్నామన్నారు. గంజాయి వ్యాపారంతో కూడబెట్టిన ఆస్తులను ఫ్రీజ్ చేస్తామని హెచ్చరించారు. ఈ తరహా నేరాల్లో అక్రమంగా అస్తులు కూడబెట్టిని ముగ్గురి వ్యక్తులకు చెందిన సుమారు రూ.5 కోట్ల విలువైన ఆస్తులను ఇప్పటికే ఫ్రీజ్ చేసామని తెలిపారు.ఈ కేసులో క్రియాశీలకంగా పని చేసిన బొబ్బిలి డిఎస్‌పి జి.భవ్యారెడ్డి, గజపతినగరం సిఐ జిఎవి రమణ, మానాపురం ఎస్ఐ ఆర్.జయంతి, ఇతర పోలీసు సిబ్బందిని ఎస్‌పి అభినందించారు. కానిస్టేబుళ్ళు కె.అప్పన్న, కె.శంకర్, హెచ్‌సి కె.అప్పల స్వామిలను ఎస్‌పి అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు.

పేదరికాన్ని రూపుమాపేందుకు పి4

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్రంలోని పేదరికాన్ని రూపుమాపడమే లక్ష్యంగా, స్వర్ణాంధ్ర 2047 విజన్‌ప్లాన్‌లో భాగంగా ప్రభుత్వం పి4 విధానాన్ని రూపొందించి ందని నగర పాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య పేర్కొన్నారు. బంగారు కుటుంబాల తుది జాబితాను తయారు చేసేందుకు ఈ నెల 15 నుంచి వార్డు సభలను నిర్వహించాలని అడ్మిన్, వెల్ఫేర్,ఎడ్యుకేషన్ కార్యదర్శులకు ఆదేశించారు. సోమవారం కార్యాలయం లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలో ఇప్పటికే 6,776 మందిని ప్రాథమికంగా బంగారు కుటుంబాలను గుర్తించామన్నారు. స్వర్ణాంధ్ర జీరో ప్రావర్టీ - పి 4 (పబ్లిక్, ప్రైవేట్ పీపుల్స్ పార్ట్ నర్ షిప్) ద్వారా ఎంపిక చేసిన బంగారు కుటుంబాల జాబితాను మరోసారి పునః పరిశీలన చేసి, మార్పులు చేర్పులతో తుది జాబితాను తయారు చేయనున్నట్లు తెలిపారు. దీనికోసం సచివాలయ సిబ్బంది ద్వారా వార్డుల్లో జులై 15 నుండి 25 జులై లోగా సభలను నిర్వహించి తుది జాబితాను తయారు చేయాల న్నారు. ఆగస్టు 15 నాటికి తుది జాబితాలో ఉన్న బంగారు కుటుంబాలను మార్గదర్శకులు దత్తత తీసుకునేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. మార్గదర్శుల సహాయ సహకారాలతో బంగారు కుటుంబాలను ఉన్నతికి తీసుకుని రావడానికి కార్యాచరణ ప్రణాళికలను జిల్లా యంత్రాంగం తయారు చేస్తోందని తెలిపారు. బంగారు కుటుంబాలను ఆర్థికంగానే కాకుండా చదువు, వైద్యం, ఇతర మౌలిక సదుపాయాల పరంగా అభివృద్ధి చేసేందుకు మార్గదర్శులు తోడ్పాటును అందిస్తారని తెలిపారు. సమావేశంలో టిపిఆర్ఒ సింహాచలం పాల్గొన్నారు.

ఉణుకూరు రహదారిని బాగు చేయాలి

- సిపిఎం ఆధ్వర్యాన నిరసన అడ్డుకున్న పోలీసులు
- సచివాలయం వద్ద కొనసాగిన ధర్నా

ప్రజాశక్తి-రేగిడి

మండలంలోని రాజాం -వంగర ప్రధాన రహదారిలో ఉణుకూరు గ్రామం వద్ద గత పదేళ్లగా గుంతలతో అధ్వానంగా మారిన రహదారికి మర్మతులు చేపట్టాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యాన సోమవారం నిరసన తెలిపారు. ఈ కార్యక్రమానికి సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.శంకర్రావు, మండల నాయకులు ఎం. త్రినాథ్ ఆధ్వర్యంలో గ్రామస్తులు, యువత హాజరయ్యారు. ఈ గ్రామం వద్ద సుమారు కిలోమీటరు మేర గత పదేళ్లుగా తారు రోడ్డు గుంతల మయం కావడంతో వాహనదారులు గుంతలో పడి గాయాలపాలవుతున్నారని ఈ సందర్భంగా తమ్మినేని అన్నారు. పాదచారులు ఈ రోడ్డుపై నడవలేని పరిస్థితి నెలకొందని అన్నారు. వర్షాలు పడితే ఈ రోడ్డు పూర్తిగా కనిపించకపోవడం ప్రయాణానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని గ్రామస్తులు అన్నారు. అయితే కొద్దిసేపటికే అక్కడికి ఎస్ఐ లీలావతి తన సిబ్బందితో వచ్చి అడ్డుకున్నారు. దీంతో గ్రామ సచివాలయం వద్ద శాంతియుతంగా ధర్నాచేశారు. తారు రోడ్డు వేసి ప్రజా రవాణా సదుపాయాలు కల్పించాలని నినాదాలు చేశారు. అనంతరం సచివాలయ వ్యవసాయ అసిస్టెంట్ జయ ప్రకాష్ కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా తమ్మినేని సూర్యనారాయణ మాట్లాడుతూ ఉణుకూరు గ్రామం వద్ద ఒక కిలోమీటరు తారు రోడ్డు గుంతల మయమై 80 గ్రామాలకు సంబంధించి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రజా సమస్యలపై పోరాడితే ఇలా 30 యాక్ట్ తో ఆంక్షలు విధించడం పోలీసులకు ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కొంతమంది అధికార పక్ష నాయకులు.. గ్రామస్తులను గత రెండు రోజుల నుంచి ధర్నాలో పాల్గొంటే పోలీసులు అరెస్ట్ చేసి జైల్లో పెడతారని బెదిరించడం సరైనది కాదన్నారు. ప్రజల నుంచి చైతన్య వస్తే గాని ప్రజా సమస్యలు పరిష్కారం కావని గుర్తు చేశారు. పాలకులు, అధికారులు తారు రోడ్డు సమస్య పరిష్కరించకుంటే భవిష్యత్తు లో ఆందోళనలు ఉధృతం చేస్తామనిహెచ్చరించారు.. వీరితోపాటు పాటు మండల సిఐటియు నాయకులు వి.లక్ష్మ నాయుడు, జి.దుర్గారావు, ఎస్ఎఫ్ఐ నాయకులు పి. రమేష్, గ్రామస్తులు ఉన్నారు.

సచివాలయం వద్ద ధర్నా చేస్తున్నసిపిఎం నాయకులు, గ్రామస్తులు

పిజిఆర్ఎస్‌కు 225 వినతులు

ప్రజాశక్తి-విజయనగరంకోట/టౌన్

ప్రజా వినతుల పరిష్కార వేదికకు వచ్చే వినతులను సకాలంలో పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం లో నిర్వహించిన పిజిఅర్ఎస్‌కు 225 వినతులు అందాయి. సంయుక్త కలెక్టర్ సేతు మాధవన్ తో పాటు డీఆర్వో ఎస్.శ్రీనివాసమూర్తి, డిప్యూటీ కలెక్టర్ మురళీ, ప్రమీలా గాంధీ, ఎం.వెంకటేశ్వరరావు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. మొత్తం అర్జీలు అందగా, భూ సమస్యలకు సంభందించి రెవిన్యూ శాఖకు అత్యధికంగా 110 వినతులు అందాయి. ఈ సందర్భంగా అధికారులతో పిజిఅర్ఎస్ ఆర్జీల పరిష్కారంపై జాయింట్ కలెక్టర్ శాఖల వారీ సమీక్ష నిర్వహించారు . ప్రజా వినతుల పరిష్కార వేదికకు వచ్చే వినతులను సకాలంలో పరిష్కరించాలని తెలిపారు. అధికారులు ప్రతి రోజు పిజిఅర్ఎస్ పోర్టల్ లాగిన్ అయి వారి శాఖకు సంబందించిన వినతులను చూడాలని, అలాగే రీ ఓపెన్ కేసులు కూడా పూర్తిగా విచారణ జరిపి ముగించాలని తెలిపారు.

ప్రభుత్వం డిగ్రీ అడ్మిషన్లు త్వరగా ప్రారంభించాలి : ఎస్ఎఫ్ఐ

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు త్వరగా ప్రారంభించాలని, డ్యూయల్ మేజర్ విధానం అమలు చెయ్యాలని సోమవారం ప్రజా సమస్యలు పరిష్కార వేదికలో డిఆర్‌కు ఎస్ఎఫ్ఐ నాయకులు వినతి ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్ ఎఫ్ ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వి.చిన్నబాబు, నగర కార్యదర్శి కె.రాజు మాట్లాడుతూ ఇంటర్ రిజల్టు వచ్చి నాలుగు నెలలు కావస్తున్న ఇప్పటివరకు ప్రభుత్వం డిగ్రీ కాలేజీలో అడ్మిషన్స్ ప్రారంభించలేదన్నారు. ఒకవైపున ప్రైవేటు కాలేజీలో అనధికారికంగా అడ్మిషన్లు చేసుకుంటూ క్లాసులు నడుపు కుంటున్నారని, దీనివలన తర్వాత ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో జాయిన్ అయ్యే విద్యార్థులు నష్టపోతారని తెలిపారు. అడ్మిషన్లు ఆలస్యం కావడం వల్ల సెమిస్టర్ పరీక్షలపై ఆ ప్రభావం పడుతుందన్నారు. ప్రభుత్వం సమస్యను వెంటనే పరిష్కారం చేయకుంటే బుధవారం కలెక్టరేట్ ముట్టడిస్తామని అన్నారు.

కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న కుమరాం గ్రామ పేదలు

దళితులు నివాసమున్నచోట రక్షణ గోడ నిర్మించాలి

ఎస్.కోట మండలం గెడ్డ కుమరాం లో పేదలు నివాసమున్నచోట రక్షణ గోడ నిర్మించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గాడి అప్పారావు, కుల వ్యవక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కార్యదర్శి ఆర్ ఆనంద్ డిమాండ్ చేశారు. కలెక్టరేట్‌లో జెసికి వినతి పత్రం సమర్పించారు. అనంతరం మాట్లాడుతూ... గెడ్డకు అనుకొని దళితులు, గిరిజనులు, వెనుకబడిన తరగతులకు చెందిన 15 కుటుంబాలు గత 80ఏళ్లగా పభుత్వ స్థలంలో పాకలు, షెడ్ లు వేసుకొని జీవిస్తున్నారని తెలిపారు. ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని ప్రభుత్వానికి ఎన్నిసార్లు దరఖాస్తులు చేసుకున్నా మంజూరు చేయలేదని అన్నారు. వీరు నివాసానికి ఆనుకొని ఉన్న వాగును వెడల్పు చేయడం వల్ల వచ్చే నీటి ప్రవాహానికి ఇళ్లు మునిగిపోయి కూలిపోయే ప్రమాదం ఉందని అధికారులకు విన్నవించడంతో రక్షణ గోడ నిర్మించేందుకు రూ.16లక్షలు మంజూరు చేశారని తెలిపారు. ఈనేపథ్యంలో ఇది గెడ్డ పోరంబోకు స్థలమని అధికారులు చెప్పడం వెనుక రాజకీయాలు ఉన్నాయని అన్నారు. అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు గురికాకుండా పేదల నివాసమున్న చోట రక్షణ గోడ నిర్మించాలని కోరారు.

జాబ్ మేళాకు 484 మంది హాజరు

ప్రజాశక్తి-విజయనగరం కోట

విజయనగరంలోని ప్రభుత్వ ఐటిఐలో సోమవారం నిర్వహించిన ప్రధాన మంత్రి నేషనల్ అప్రెంటీస్ మేళాకు సుమారు 484 మంది అభ్యర్థులు హాజరైనట్లు ప్రభుత్వ ఐటిఐ కళాశాల ప్రిన్సిపల్ కన్వీనర్ టివి గిరి తెలిపారు. ఇందులో ఈస్ట్ కోస్ట్ రైల్వే అప్రెంటీస్‌కు 331 మంది అర్హత పొందారని తెలిపారు. అర్హత పొందిన వారు అందర్నీ వారి మార్కుల ఆధారంగా మెరిట్ లిస్ట్ తయారయ్యాక ఇంటర్వ్యూలకు పిలుస్తామని ప్రతినిధి జె. ప్రకాష్ తెలిపారు. వరుణ్ మోటార్స్ నుంచి హెచ్ఆర్ వరుణ్, జయభేరి నుంచి హెచ్ఆర్ ప్రియదర్శిని, ఐఎఫ్‌బి హెచ్ఆర్ కనకవాసు, భగవతి ప్రొడక్ట్స్ నుండి కమల్ హాజరయ్యారు.

అప్రెంటీస్ మేళాకు హాజరైన అభ్యర్థులు

నిజాయితీకి విఆర్ నజరానా

వన్‌టౌన్ సిఐ బదిలీపై పోలీస్ శాఖలో చర్చ

ఇలా అయితే నిజాయితీగా పని చేస్తారా?

ప్రజాశక్తి - కంటోన్మెంట్

విజయనగరం వన్ టౌన్ సిఐ ఎస్.శ్రీనివాస్‌ను విఆర్‌కు బదిలీ చేయడం పట్ల సర్వత్రా చర్చ జరుగుతోంది. నిజాయితీగా ఉండే పోలీసు అధికారుల పట్ల పోలీసు ఉన్నతాధికారులు వ్యవహరించిన తీరుపై పోలీసు అధికారులు మదనపడుతున్నారు. నిజాయితీకి నజరానాలా అంటూ చర్చించుకుంటున్నారు. శ్రీనివాస్ తప్పు లేకపోయినా హుటాహుటిన విఆర్‌కు బదిలీ చేయడం పట్ల పోలీస్ శాఖలో సంచలనంగా మారింది.

విజయనగరం వన్ టౌన్ సిఐ కొద్ది రోజుల క్రితం 700 గ్రాముల బంగారంతో ఒక వ్యక్తిని పట్టుకున్నారు. బంగారానికి ఎటువంటి ఆధారాలను అతడు చూపించలేక పోయాడు. సిఐ ఉన్నతాకారులకు బంగారం పట్టుకున్న విషయాన్ని తెలియజేయడంతో నిబంధనలు ప్రకారం వ్యవహరించాలని పోలీసు ఉన్నతాధికారి సిఐకు తెలిపారు. బంగారంతో పట్టుబడ్డ వ్యక్తి తన యజమానికి సమాచారం అందించడంతో అతను విజయనగరం వచ్చాడు. జిఎస్‌టి లేదా ఆదాయపు పన్నుశాఖ అధికారులకు ఈ కేసును బదలాయించాలని కోరారు. సిఐ ఉద్దేశపూర్వకంగా చేస్తున్నారని బంగారు వ్యాపారి అమరావతిలో ఉన్న ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకువెళ్లారు. ఓ ప్రముఖ ప్రజాప్రతినిధి పిఎ ఫోను చేసినా మాట్లాడేందుకు సిఐ ఇష్టపడలేదు. రెండు మూడు సార్లు మాట్లాడక పోవడంతో అమరావతిలో పెద్దలు రాష్ట్ర పోలీసు అధికారుల దృష్టిని తీసుకువెళ్లారు.దీంతో సిఐ ఎస్. శ్రీనివాస్ ను ఆఘ మేఘాల మీద విఆర్ కు పంపించినట్లు సమాచారం. ఇలా నిజాయితీగా పని చేసే అధికారులకు బదిలీలు ఉంటే భవిష్యత్‌లో బాధితులకు న్యాయం జరుగుతుందా అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇలాంటి బదిలీలు ఉంటే పోలీస్ అధికారులు నిజాయితీగా ఎలా పనిచేయగలరన్న చర్చ జరుగుతోంది.

పకడ్బందీగా ఎపిపిఎస్‌సి పరీక్షలు : జెసి

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

ఎపిపిఎస్‌సి నిర్వహిస్తున్న లెక్చరర్ ఉద్యోగాల పోటీ పరీక్షలను ఎటువంటి ఫిర్యాదులు రాకుండా పకడ్బందీగా నిర్వహించాలని, అందుకు తగిన ఏర్పాట్లు పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ అధికారులను ఆదేశించారు. ఎపిపిఎస్ సి ద్వారా లెక్చరర్ ఉద్యోగాల భర్తీకి నిర్వహిస్తున్న పోటీ పరీక్షల ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 15 నుంచి 23 వరకు జిల్లాలో నాలుగు కేంద్రాల్లో పరీక్షలు జరుగుతాయని తెలిపారు. రాజాంలోని జిఎంఆర్ కాలేజీ, జొన్నాడలో గల లెండి కాలేజీ, గాజులరేగ వద్ద గల ఆయాన్ డిజిటల్ జోన్, చింతలవలస ఎంవిజి ఆర్ ఇంజనీరింగ్ కాలేజీలలో కంప్యూటర్ ద్వారా ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహిస్తారన్నారు. పరీక్షాకేంద్రాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. అవసరమైన అదనపు బస్సులు ఏర్పాటుచేయాలని ప్రజా రవాణా శాఖ అధికారులను ఆదేశించారు. పరీక్షా సమయంలో ఇంటర్నెట్, విద్యుత్ అంతరాయాలు లేకుండా చర్యలు తీసుకోవాలని, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని తెలిపారు. పరిక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలుచేయాలన్నారు. అభ్యర్థులు పరిక్షా కేంద్రాలకు ముందుగా చేరుకోవాలని సూచించారు. సమావేశంలో ఎపిపిఎస్‌సి, పోలీస్, రెవిన్యూ, ప్రజా రవాణా, విద్యుత్, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

విద్యకు అధిక ప్రాధాన్యత : అశోక్

ప్రజాశక్తి-విజయనగరంకోట

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని టిడిపి సీనియర్ నాయకులు, కేంద్ర మాజీమంత్రి పి.అశోక్‌గజపతిరాజు అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాం తదితర సదుపాయాలు కల్పిస్తోందన్నారు. విజయనగరం మండలం మలిచర్ల, ధర్మపురి ప్రభుత్వ పాఠశాలలను ఆయన సోమవారం సందర్శించారు. వివివిధ సందర్భాల్లో ఆయనకు అభిమానులు, కార్యకర్తలు ఇచ్చిన పుస్తకాలు, పెన్నులను ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి తో కలసి విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులంతా బాగా చదువుకొని భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని కోరారు. అనంతరం మలిచర్ల పాఠశాలలో మొక్కలు నాటారు. టిడిపి నాయకులు బొద్దల నర్సింగరావు, ప్రసాద్, ఎంఇఒ సత్యవతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేటి నుంచి బాబు ష్యూరిటీ -మోసం గ్యారెంటీ

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలో మంగళవారం నుంచి మాజీ ఎమ్మెల్యే బడ్డు కొండ అప్పలనాయుడు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైసిపి మండల అధ్యక్షుడు పిన్నింటి తమ్ముబాబు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించి ఈ నెల 18వ తేదీ వరకు నిర్వహిస్తామన్నారు. మొదటి రోజు చొల్లంగిపేట, డీ కొల్లం, గుణుపూరుపేట, గుణుపూర్, డెంకాడ, సింగవరం, నాతవలస గ్రామాల్లోనూ, 16వ తేదీన డి. తాళ్లవలస, అమకాం, రఘుమండ, వెదుళ్లవలస, పెదాద, గొలగాం, 17వ తేదీన చింతలవలస, బొడ్డవలస, జొన్నాడ, మోదవలస, కొండరాజుపేట, బంగార్రాజుపేట, అకులపేట, 18వ తేదీన మోపాడ, గంట్లం, బంటుపల్లి, అక్కివరం గ్రామాల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తామని మండలంలో ఉన్న ఎంపిటిసిలు, సర్పంచులు, వైసిపి నాయకులు, పాల్గొనాలని కోరారు.

అంత్యక్రియలకు కలప ఉచిత సరఫరా

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఎవరైనా మరణిస్తే అంత్యక్రియలకు ఉచితంగా కలప సరఫరా చేస్తానని నగర పంచాయతీ 7వ వార్డు కౌన్సిలర్ మైపాడ ప్రసాద్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ నగర పంచాయతీతో పాటు, మండలంలో ఎవరైనా మరణిస్తే దహనం చేయడానికి ఉచితంగా కలప సరఫరా చేస్తానని చెప్పారు. కలప నెల్లిమర్ల-రామతీర్థం రహదారి రైల్వే ఓవర్ బ్రిడ్జి వద్ద గల బ్రాందీ షాపు పక్కన అందుబాటులో ఉంటుందని, ఎవరైనా మరణిస్తే కుటుంబ సభ్యులు వచ్చి దహనం కోసం తీసుకెళ్లవచ్చని కోరారు. వర్షాకాలంలో మృతదేహాలను దహనం చేయడానికి ఆరుదల కలప దొరకడం కష్టంగా ఉంటుందని, ఈ నేపథ్యంలో దహనానికి కలప ఏర్పాటు చేశామని చెప్పారు. కలప కావాల్సిన వారు 9441966561 నెంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

రోటరీ క్లబ్ నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - బొబ్బిలి

బొబ్బిలి రోటరీ క్లబ్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక సూర్య రెసిడెన్సీలో రోటరీ జిల్లా చైర్మన్ జేసీ రాజు అధ్యక్షత సోమవారం సమావేశం నిర్వహించారు. అధ్యక్ష, కార్యదర్శులుగా వారణాసి శ్రీహరి, కె.శివకాంత్, కోశాధికారిగా డేవిడ్ జె విక్టర్, గౌరవ అధ్యక్షులుగా టిఎస్ఎస్ కార్తీక్, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా ఎస్.శ్రీనివాస్, కార్యనిర్వాహక కార్యదర్శిగా కె.రామకృష్ణ, వైస్ ప్రెసిడెంట్‌గా కె.నాగరాజుతో పాటు మరో 12 మందిని వివిధ విభాగాల సభ్యులుగా ఎన్నుకున్నారు. రోటరీ సంస్థకు జేసీ రాజు రూ.100 డాలర్లు విరాళంగా ఇవ్వగా గెంబలి శ్రీనివాసరావు, వారణాసి శ్రీహరి, శివకాంత్ రూ.300 డాలర్లను ప్రకటించారు. అసిస్టెంట్ గవర్నర్ కృష్ణగోపాల్ నూతన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు.

బాడీ బిల్డింగ్ పోటీల్లో ద్వితీయ స్థానం

ప్రజాశక్తి - బొబ్బిలి

కడపలో ఆదివారం జరిగిన బాడీ బిల్డింగ్ పోటీలలో పట్టణంలోని అగురువీధికి చెందిన రమేష్ ద్వితీయ స్థానంలో నిలిచారు. రెండు వారాలు క్రితం ఢిల్లీలో జరిగిన పోటీలలో రెండు బహుమతులను సాధించారు. బాడీ బిల్డింగ్ క్రీడాకారుడు రమేష్ ను పలువురు అభినందించారు.

నేడు ప్రభుత్వ ఐటిఐలో జాబ్ మేళా

ప్రజాశక్తి - బొబ్బిలి

స్థానిక ప్రభుత్వ ఐటిఐలో మంగళవారం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ పివి శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. వీల్స్ ఇండియా లిమిటెడ్ కంపెనీ యాజమాన్యం జాబ్ మేళా నిర్వహిస్తుందన్నారు. ఐటిఐ ఉత్తీర్ణత సాధించిన వారు, ఐటిఐ ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాసే విద్యార్థులు జాబ్ మేళాకు అర్హులన్నారు. ఆసక్తి ఉన్నవారు ఐటిఐ, టెన్త్ మార్క్స్ లిస్ట్, ఆధార్, కుల ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని కోరారు.

పనులను పరిశీలించిన కేంద్ర బృందం

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

మండలంలోని ఏ.వెలగవలస, శివడవలస గ్రామాల్లో ఎన్ఎల్ఎం కేంద్ర బృందం సోమవారం పలు కేంద్ర పథకాలను పరిశీలించారు. ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన ఫారం పండ్స్, ధీనదయాల్ అంత్యోదయ యోజన గ్రామీణ జీవనోపాధుల, తదితర పథకాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర బృంద సభ్యులు సునీల్ బంట, నాతుసింగ్, ఎంపిడిఒ రవికుమార్, డిప్యూటీ ఎంపిడిఒ భాస్కరావు, ఎపిఒ లక్ష్మీపతిరాజు, ఎపియం భాగ్యలక్ష్మి, విజయనగరం నుండి వెలుగు ఐబి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ఎంపిడిఒ కార్యాలయంలో బదిలీల సందడి

ప్రజాశక్తి - వేపాడ

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బదిలీ అయిన సచివాలయ ఉద్యోగులతో సోమవారం సందడిగా కనిపించింది. మండలంలోని 18 గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న సిబ్బంది బదిలీ కావడంతో వారంతా రిలీజింగ్ ఆర్డర్ కాపీలు కోసం ఎంపిడిఒ కార్యాలయానికి వచ్చారు. దీంతో ఎంపిడిఒ కార్యాలయం ఉద్యోగులతో కిటకిటలాడింది. ఈ సందర్భంగా ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ మాట్లాడుతూ బదిలీపై వెళ్తున్నవారు వస్తున్న వారు విధులను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. నూతనంగా ఈ మండలంలో చేరుతున్న ఉద్యోగులకు ఏమైనా సమస్య ఉంటే తన దృష్టికి తీసుకు రావాలని చెప్పారు.

నేడు మిగులు సీట్ల భర్తీకి కౌన్సిలింగ్

ప్రజాశక్తి- విజయనగరం

5వ తరగతి నుంచి ఇంటర్ తరగతుల్లో మిగులు సీట్ల భర్తీకి పూసపాటిరేగ మండలంలోని కొప్పర్ల పాఠశాలలో మంగళవారం కౌన్సిలింగ్ నిర్వహిస్తామని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల, కళాశాల ఉమ్మడి జిల్లాల డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ రూపావతి తెలిపారు. ఈ విద్య సంవత్సరం నుంచి 10వ తరగతి, ఇంటర్మీడియట్ రెండువ సంవత్సరం సీట్లు కూడా భర్తీ చేస్తామన్నారు. ఆసక్తి గల బాలబాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పదో తరగతిలో చేరేందుకు 9వ తరగతి ఫైనల్ మార్క్స్ షీట్, స్టడీ సర్టిఫికెట్, ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో చేరేందుకు ఫస్ట్ ఇయర్ 50శాతం మార్కులతో పాస్ అయ్యి ఉండాలన్నారు 5,6,7,8,9, జూనియర్ ఇంటర్మీడియట్‌కే మిగులు ఉన్న సీట్లుకే ఎస్‌సటి, ఎస్‌టి విద్యార్థుల హాజరు కావాలన్నారు. ఇతర వివరాలకు 8985883015, 6303838657 నెంబర్లను సంప్రదించాలని ఆమె కోరారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి - వేపాడ

మండల కేంద్రంలో విశాఖ పాల ఉత్పత్తి కేంద్రం వద్ద శంకర్ ఫౌండేషన్, శ్రీవిక్టరీ యాజమాన్యం సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన కంటి వైద్య శిబిరానికి స్పందన లభించింది. ఈ శిబిరంలో 30 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 15 మందిని కంటి శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. ఈ వైద్య శిబిరంలో వైద్య నిపుణులు స్వప్న, నర్సింగ్ వనజ, కోఆర్డినేటర్ జోగారావు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు మోసాలు ప్రజలకు తెలియాలి

ప్రజాశక్తి - లక్కవరపుకోట

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ పథకాల పేరిట చేసిన మోసాలు ప్రజలకు తెలియాలని మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో గోల్డ్ స్టార్ కూడలి వద్ద వెంకటసాయి కళ్యాణ మండపంలో ఎంపిపి శ్రీనివాసరావు అధ్యక్షతన వైసిపి విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బాబు ష్యూరిటీ -మోసం గ్యారెంటీ అనే నినాదం ఈనెల 19 నుంచి అన్ని గ్రామ పంచాయతీలలో ఆగస్టు 30 వరకు 9 మంది కమిటీ సభ్యులు నియమించుకుని విస్తృతంగా బాబు మోసాలను వివరించాలన్నారు. ఈ సమావేశంలో జెడ్‌పిటిసి తూర్పాటి వరలక్ష్మి, చందులూరు ఎంపిటిసి ఎడ్ల కిషోర్, వైస్ ఎంపిపి ఆవాల శ్యామల, ముదునూరు శ్రీనివాసరాజు, బోకం అప్పారావు, కె.మహేష్ తదితరులు పాల్గొన్నారు.

చట్ట పరిధిలో సమస్యలు పరిష్కారం

కంటోన్మెంట్: చట్ట పరిధిలో సమస్యలకు వెంటనే పరిష్కారం చూపాలని పోలీసు అధికారులను ఎస్‌పి వకుల్‌జిందాల్ ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజల నుంచి 38 వినతులు స్వీకరించారు. భూ తగాదాలకు సంబంధించినవి 8, కుటుంబ కలహాలకు సంబంధించినవి 1, మోసాలకు పాల్పడినట్లు 3, ఇతర అంశాలకు సంబంధించినవి 26ఫిర్యాదులు ఉన్నాయి. ఫిర్యాదులను పరిశీలించిన ఎస్‌పి వాటిపై విచారణ చేపట్టి చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి పి.సౌమ్యలత, ఎస్‌బి సిఐ ఆర్.వి.ఆర్.కె.చౌదరి, డిసిఆర్‌బి సిఐ బి.సుధాకర్, ఎస్ఐ రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

నిమ్మలపాడు రేషన్ డీలర్‌ను సస్పెండ్ చేయాలి

బొబ్బిలిరూరల్ : నిమ్మలపాడు రేషన్ డీలర్‌ను సస్పెండ్ చేయాలని సిపిఐ ఆధ్వర్యంలో తహశీల్దార్ శ్రీనుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆపార్టీ జిల్లా కార్యదర్శి ఓమ్మి రమణ మాట్లాడుతూ రేషన్ సరుకులు సక్రమంగా ఇవ్వక పోవడంతో ఆ గ్రామంలో ఉన్న గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆగ్రామ గిరిజనులు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వం ద్వారా కేసుల పరిష్కారం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

మధ్యవర్తిత్వం ద్వారా త్వరితగతిన కేసులు పరిష్కారమవుతాయని న్యాయమూర్తి, మండల న్యాయసేవా కమిటీ ఛైర్‌పర్సన్ బి.కనకలక్ష్మి అన్నారు. స్థానిక కోర్టు ఆవరణలో న్యాయవాదులతో సోమవారం 'మధ్యవర్తిత్వం-దేశం కోసం' అనే అంశంపై న్యాయ అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోర్టులో పెండింగులో ఉన్న సివిల్, చెక్ బౌన్స్, కుటుంబ, పరిష్కరించ దగ్గ క్రిమినల్ కేసులను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు. ఎస్.కోట కోర్టులో అన్ని రకాల కేసులు సుమారు 1300 పెండింగులో ఉన్నాయని తెలిపారు. మధ్యవర్తిత్వం అనేది స్వచ్ఛంద ప్రక్రియ అని రెండు పక్షాల సహకారంతో సాగుతుందని, నిష్పక్షపాత మధ్యవర్తి సాయంతో చర్చలు జరుపుకుని కోర్టు వెలుపల పరిష్కారం చేసుకోవచ్చు అని అన్నారు. మధ్యవర్తిత్వం ద్వారా కేసు పరిష్కారమయితే రాత పూర్వక ఒప్పందం నమోదు చేయడంతో పాటు కోర్టు ప్రొసీడింగ్స్ జారీ చేస్తామని చెప్పారు. న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు జి.సూరిదేముడు మాట్లాడుతూ మధ్యవర్తిత్వంలో ఇరు పక్షాల సమ్మతి తప్పనిసరని, దీని వల్ల కక్షిదారులకు సమయం, ఖర్చు ఆదా అవుతాయని వెల్లడించారు. మధ్యవర్తిత్వం ప్రక్రియ అమలు వల్ల కోర్టుల్లో కేసుల పెండింగును తగ్గించడం, ఉభయ పక్షాల మధ్య స్నేహ సంబంధాలు నిలిపేలా చూడడం, శీఘ్ర పరిష్కారం, వివాదాన్ని రెండు పక్షాలకు అనుకూలంగా పరిష్కరించడం, ఖర్చు తక్కువగా ఉండడం జరుగుతుందని అన్నారు. ఈ సమావేశంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి బివిఎస్ రామారావు, టివిఆర్ మూర్తి, ఉపాధ్యక్షుడు బొడ్డు వెంకటరావు, ట్రెజరర్ బి.త్రిమూర్తులు, మీడియా సెక్రటరీ డబ్ల్యుఎస్ శర్మ, లైబ్రరీ సెక్రటరీ ఆర్.సత్యనారాయణ, లోక్ అదాలత్ సభ్యుడు బి.సత్యనారాయణ, సీనియర్ న్యాయవాదులు గేదెల ప్రకాష్, బొడబల్ల రామకృష్ణ, అల్లు మహాలక్ష్మి నాయుడు, సిహెచ్.ఆర్.ఎ.నాయుడు, వియ్యపు రమణ, లక్ష్మి, బొబ్బిలి రామకృష్ణ, నెక్కల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: మధ్యవర్తిత్వంతో ఇరువర్గాలకు న్యాయం చేయాలని జూనియర్ సివిల్ జడ్జి హేమప్రసాద్ జానకిరామ్ కోరారు. స్థానిక కోర్టులో సోమవారం న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఆస్తి తగాదాలు, భార్యాభర్తల గొడవలు, ప్రామిసరీనోట్లు, చెక్ బౌన్స్ కేసులు పరిష్కారానికి మధ్యవర్తిత్వం చేసి న్యాయం చేసే అవకాశం ఉందన్నారు. మధ్యవర్తిత్వం చేసే న్యాయవాదులు ఇరువర్గాల అభిప్రాయాలు తీసుకుని నోట్స్ తయారు చేసి న్యాయం చేయాలన్నారు. ఈ సమావేశంలో బార్ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

న్యాయమూర్తి బి.కనకలక్ష్మి

ఎస్‌కోట: సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి కనకలక్ష్మి

23 నుంచి జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్

ప్రజాశక్తి- శృంగవరపుకోట

ఈనెల 23, 24, 25 తేదీల్లో జిల్లా బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్, ఎంపిక పోటీలను నిర్వహిస్తామని జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ చైర్మన్, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు తెలిపారు. పట్టణంలోని ఫ్రెండ్స్ రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రఘురాజు మాట్లాడుతూ మూడు రోజులు పాటు విజయనగరం డిఎస్ఎ ఇండోర్ స్టేడియంలో ఈ పోటీలను నిర్వహిస్తామన్నారు. ఈ పోటీలు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షులు కెఎ నాయుడు, గౌరవ అధ్యక్షులు ద్వారపురెడ్డి జగదీష్, సహాధ్యక్షులు డాక్టర్ విఎస్ ప్రసాద్, ఎంకెబి శ్రీను, కార్యదర్శి నున్న సురేష్, ఆర్గనైజింగ్ కార్యదర్శి సిహెచ్. కుటుంబరావు ఆధ్వర్యంలో నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ సహకార దర్శి ఇందుకూరి సుబ్బలక్ష్మి, జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ సిఇఒ, పొట్నూరు శ్రీరాములు పాల్గొన్నారు.

టిడిపితోనే గ్రామాల అభివృద్ధి : కర్రోతు

ప్రజాశక్తి- డెంకాడ(భోగాపురం)

టిడిపితోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఎపి మార్క్‌ఫెడ్ చైర్మన్, నెల్లిమర్ల నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి కర్రోతు బంగార్రాజు అన్నారు. భోగాపురం మండలంలోని లింగాలవలస గ్రామంలో సోమవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి టిడిపి కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో అందించిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బుగత రామ్మోహన్, టిడిపి నాయకులు కనకల పైడినాయుడు, సురల వెంకటరమణ, ఓదూరి నరసింహులు, రాంబోతు అప్పలనాయుడు, గ్రామ టిడిపి అధ్యక్షులు ఎరుబోతు గౌరీబాబు, బూత్ ఇంచార్జి బర్ల శ్రీను, కనకల నాగ, కొలుసు అప్పలనారాయణ, బి.బంగార్రాజు పాల్గొన్నారు.

బాడంగి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే బేబినాయన అన్నారు. మండలంలోని ఎరుకులపాకలలో సోమవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఎరుకలపాకలు గ్రామం అంటే తెంటు జయప్రకాశ్ ఊరు అని అన్నారు. వైసిపి అధికారంలో చాలా ఇబ్బందులకు గురి చేసినా ఇక్కడ నాయకులు, ప్రజలు పార్టీ మారలేదని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు తెంటు రవిబాబు, టిడిపి ఎస్టి సెల్ కార్యదర్శి, ఎంపిటిసి గౌరు, సర్పంచ్ పాలవలస పార్వతి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భోగాపురం : కరపత్రాలను పంపిణీ చేస్తున్న కర్రోతు

పారా స్పోర్ట్స్‌తో వికలాంగులకు అవకాశాలు

ప్రజాశక్తి- శృంగవరపుకోట

పారా క్రీడాకారులకు ప్రభుత్వాలు అనేక అవకాశాలను కల్పిస్తున్నందున పారా స్పోర్ట్స్ ఆడేందుకు వికలాంగులంతా ఆశక్తి చూపించాలని ఎస్.కోట సిఐ కోరారు. పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఎస్.కోటలోని సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో నడుస్తున్న భవిత కేంద్రంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా పారా క్రీడాకారులకు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలకు సంభందించిన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వికలాంగులకు చదువుతో పాటుగా ఆటలు అవసరమని, శారీరక, మానసిక ఆరోగ్యానికి ఆటలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. స్పోర్ట్స్ పాలసీ ద్వారా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులకు ప్రభుత్వం నగదు ప్రోత్సాహం అందిస్తుందని, పారా ఒలింపిక్స్, పారా ఆసియన్ గేమ్స్‌లో మెడల్స్ సాధించిన విజేతలకు కోట్లాది రూపాయిలు భారీ ప్రోత్సాహం అందిస్తుందని అన్నారు. ఇటీవల విడుదల చేసిన జిఒ నంబర్ 4 ద్వారా 3శాతం ప్రభుత్వ ఉద్యోగాలను కల్పించడం అద్భుతమైన అవకాశమని, వీటితో బాటు అనేక అవకాశాలు కల్పిస్తుందని తెలిపారు. ఈ అవకాశాలను అందిపుచ్చుకునేందుకు వికలాంగులంతా పారా క్రీడలు ఆడాలని సూచించారు.

ఈ నెల 20న విజయనగరం రాజీవ్ స్టేడియంలో జరగనున్న పారా జూనియర్, సబ్ జూనియర్ పోటీల్లో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో పారా స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షులు కె.దయానంద్, ఎస్.కోట ప్రతినిధి పూసపాటి ప్రతాప్ వర్మ, స్కూల్ రిసోర్స్ పర్సన్ లీలా కృష్ణ, శ్రీకన్య, శ్రావణి, వికలాంగుల తల్లితండ్రులు తదితరులు పాల్గొన్నారు.

గొంప దేముడమ్మకు ఘన నివాళి

ప్రజాశక్తి - వేపాడ

బానాది గ్రామానికి చెందిన టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు మాతృమూర్తి గొంప దేముడమ్మకు పలువురు టిడిపి నాయకులు ఘన నివాళి అర్పించారు. దేముడమ్మ సంతాప సభ సోమవారం బానాదిలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో భారీ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో డిసిఎం ఎస్ చైర్మన్, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి గొంప కృష్ణ, నియోజకవర్గం టిడిపి మహిళా అధ్యక్షులు, ఐదు మండలాల పార్టీ అధ్యక్షులు, వేపాడ మండలంలో గల 29 గ్రామపం చాయతీలు టిడిపి అభిమానులు, సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

దేముడమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ

టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు తల్లి కొద్ది రోజుల క్రితం పరమపదించిన కారణంగా బల్లంకి ప్రాథమిక పాఠశాలలో సోమవారం ఆయన కుమార్తె లక్ష్మీ ప్రసన్న విద్యార్థులకు నోట్ బుక్స్, పలకలు, పెన్సిల్స్, పెన్నులు పంపిణీ చేశారు.

పోర్టుఫైడ్ బియ్యంతో బహుళ ప్రయోజనాలు

ప్రజాశక్తి - రామభద్రపురం

కేంద్ర ప్రభుత్వం రేషన్ షాపులకు సరఫరా చేస్తున్న పోర్టుఫైడ్ బియ్యంతో బహుళ ప్రయోజనాలు కలుగుతాయని ఫుడ్ కార్పోరేషన్ ఇండియా చీఫ్ జనరల్ మేనేజర్ రాజగోపాల్ తెలిపారు. మండల కేంద్రంలో ఉన్న చౌకధరల డిపోను సోమవారం ఆయన తనిఖీచేసి లబ్ధిదారులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఎంతో ఉదారంగా పిల్లలకు, మహిళలకు ఫోర్టిఫైడ్ బియ్యం సరఫరా చేస్తుందని దీంతో పౌష్టికాహారం లభిస్తుందని అన్నారు. ఒక కిలో ఫోర్టిఫైడ్ రైసు తయారు చేయడానికి రూ.75లు ఖర్చు అవుతుందన్నారు. జిల్లాలో సమారు 70 శాతం బియ్యాన్ని కేంద్ర ప్రభుత్వం సమకూరుస్తుందనీ, మిగతా 30 శాతం రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు.

రేషన్ డిపోను తనిఖీ చేసిన కేంద్ర బృందం

కార్డుదారులకు సక్రమంగా రేషన్ బియ్యం అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. రేషన్ సరిగా ఇవ్వకపోతే టోల్ ఫ్రీ నెంబరుకు ఫిర్యాదులు చేయాలని సూచించారు. విజయనగరం జిల్లా వెనుకబడి ఉండడంతో 95 శాతం మేరకు కేంద్ర ప్రభుత్వమే నేరుగా బియ్యం అందిస్తుందన్నారు. అనంతరం రేషన్ షాపులో ఉన్న స్టాకును పరిశీలించి ఈపాస్ యంత్రాన్ని పరిశీలించారు. ఈ రేషన్ షాపు పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి కే.మధుసూదన్, ఎఫ్ సీఐ ఏజీఎం సందీప్ సర్కార్, మేనేజర్లు వరుణ్ కుమార్, నరేష్ కుమార్, బొబ్బిలి సిఎస్ డిటి సాయికృష్ణ, ఉప తహశీల్దార్ గిరిధర్, టిఎ నాగరాజు, డీలర్ల సంఘం అధ్యక్షుడు చొక్కాపు రామారావు, వెలమ కార్పోరేషన్ డైరెక్టర్ కొల్లి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మిషన్‌ను తనిఖీ చేస్తున్న కేంద్ర బృంద సభ్యులు

విజిలెన్స్ దాడుల్లో రూ.17లక్షల సరుకులు సీజ్

ప్రజాశక్తి - రామభద్రపురం

పురుగు మందుల షాపుల్లో నిబంధనలు అమలు చేసి వినియోగదారులకు నాణ్యమైన సరుకులు విక్రయించాలని విజిలెన్స్, వ్యవసాయ శాఖ అధికారులు ఆదేశించారు. సోమవారం ఈ రెండు శాఖల అధికారులు ఆరికతోట, రామభద్రపురం షాపుల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆరికతోట శ్రీసత్య వెంకట మల్లికార్జున స్టోర్‌లో సుమారు రూ.4.77 లక్షలు, రామభద్రపురం శ్రీ వెంకటేశ్వర ట్రేడర్స్‌లో రూ.12.55లోలు విలువైన వివిధ రకాల డిఎపి, ఎంఒపి, అమ్మోనియం సల్ఫేట్ వంటి వాటికి ఆయా కంపెనీలకు చెందిన సరఫరా ధృవీకరణ పత్రాలు లేనట్లు గుర్తించి వీటి అమ్మకాలు నిలుపుదల చేసేందుకు శ్రీ ముఖాలు జారీ చేశారు. ఈ సందర్భంగా విజిలెన్స్ సీఐ అప్పలనాయుడు మాట్లాడుతూ షాప్ లైసెన్స్‌తో పాటు ప్రతీ విలువైన సరుకుకి ఆ కంపెనీ నుంచి సరఫరా ధృవీకరణ పొంది ఉండాలని తెలిపారు. రైతులకు నాణ్యమైన సరుకులు సరసమైన ధరలకే విక్రయించాలని ఆదేశించారు. రైతులు కొనుగోలు చేసిన ప్రతీ వస్తువుకు బిల్లు తీసుకుని వాటిని భద్ర పరచాలని సరకుల్లో నాణ్యత లోపిస్తే బిల్లు ఆధారంగా పరిహారం పొందేందుకు ఉపకరిస్తుందన్నారు. ఈ తనిఖీల్లో సహాయ వ్యవసాయ సంచాలకులు రామారావు, స్థానిక ఎఒ శివ, ఎఇఒ వెంకటరమణ, విఎఎ కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

ఇలా ప్రారంభించి.. అలా ముగించి

వ్యక్తిగత కారణాలంటూ మండల సమావేశాన్ని ముగించిన ఎంపిడిఒ

ప్రజాశక్తి - చీపురుపల్లి

మండలంలోని గ్రామాలలో నెలకొన్న ప్రధాన సమస్యలపై చర్చించాల్సిన మండల సర్వసభ్య సమావేశం ఇలా ప్రారంభించి అలా ముగించారు. ఒకపక్క ఖరీఫ్ సీజన్ మరో పక్క వర్షాకాలం సమీపిస్తుండడంతో ప్రధాన అంశాలైన సీజనల్ వ్యాధులు పారిశుధ్యం మెరుగు తాగునీటి సరఫరా వంటి వాటిపై సుదీర్ఘ చర్చ జరగాల్సి ఉంది. వ్యవసాయానికి సంబంధించి ఎరువులు విత్తనాలు పురుగుమందులు వంటివి రైతులకు అందుబాటులోకి ఏ విధంగా తీసుకురావాలి వంటి అంశాలపై మండల సమావేశంలో సుదీర్ఘంగా ప్రజాప్రతినిధులు అధికారులతో చర్చించాల్సిన సమయంలో వ్యక్తిగత కారణాల వల్ల మండల సమావేశాన్ని ప్రారంభించిన ఐదు నిమిషాలలోనే ముగిస్తున్నామని ఎంపిడిఒ చెప్పడంతో అధికారులు ఒక్కసారిగా అవాక్కయ్యారు. అసలు ఎందుకు సమావేశాన్ని ముగిస్తున్నారో కచ్చితంగా చెప్పకుండా వ్యక్తిగత సమస్యలు వల్ల ముగిస్తున్నామని చెప్పడం విడ్డూరంగా అనిపించింది. వాస్తవానికి గరివిడిలో వైసిపి సమావేశం ఉండటంతో సర్వసభ్య సమావేశానికి వచ్చిన వైసిపి వారంతా అక్కడకు వెళ్లాల్సి ఉంది. పైగా టిడిపి సర్పంచులు, ఎంపిటిసిలు కూడా రాలేదు. దీంతో ఎంపిడిఒ ఈ విషయాలు ఏవీ చెప్పకుండా వ్యక్తిగత కారణాల వల్ల సమావేశం ముగించేస్తున్నామని వెల్లడించారు. మండలంలో 19 పంచాయతీలుండగా ఆయా పంచాయతీలకు సంబంధించి వైసిపి సర్పంచులు, ఎంపిటిసిలు మండల సమావేశానికి హాజరయ్యారు. అధికార కూటమి పార్టీకి సంబంధించిన సర్పంచులు గాని, ఎంపిటిసిలు గాని ఏ ఒక్కరూ సమావేశానికి హాజరు కాలేదు. ఈ తరుణంలో ప్రజా సమస్యలపై చర్చించాల్సిన మండల సర్వసభ్య సమావేశం ఏమి చర్చించకుండానే ప్రారంభించిన వెంటనే ముగించడంతో ప్రజా ప్రతినిధులు వ్యవహరిస్తున్న తీరుపట్ల సర్వత్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సమావేశంలో ఎంపిపి ఇప్పిలి వెంకట్ నరసమ్మ, జెడ్‌పిటిసి వలిరెడ్డి శిరీష రాణి, ఎంపిడిఒ సురేష్ కుమార్ పాల్గొన్నారు

సమావేశం ముగిసిందని ప్రకటిస్తున్న ఎంపిడిఒ

నగర పాలక సంస్థలో వినతులు స్వీకరణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రజా వినతుల పరిష్కారానికి కృషి చేస్తున్నామని కమిషనర్ నల్లనయ్య తెలిపారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వినతలు స్వీకరించారు అనంతరం ఆయన మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి వెంటనే చొరవ చూపాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. కాలువలను ఆక్రమించి పలకలను, ఇతర నిర్మాణాలను చేపడుతున్నారని, దీనివల్ల వర్షం కురిస్తే నీటి ప్రభావానికి అడ్డంకిగా మారుతోందని అన్నారు. కాలువలపై ఎటువంటి నిర్మాణాలు గానీ ఆక్రమణలను గాని చేపట్ట రాదని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ రమణమూర్తి, ఇఇ ప్రసాద్ పాల్గొన్నారు.

కాలువల ప్రక్షాళన జరగాలి

నగరంలోని అన్ని కాలువల చెత్త ప్రక్షాళనకు కృషి చేయాలని ప్రజారోగ్య సిబ్బందికి కమిషనర్ నల్లనయ్య ఆదేశించారు. ఎంహెచ్ఒ కొండపల్లి సాంబమూర్తి, పారిశుధ్య పర్యవేక్షకులతో కలిసి ప్రధాన కాలువలను పరిశీలించారు. ప్రధానంగా మార్కెట్ ప్రాంతాలలో పళ్ళు, కూరగాయలు,పూలు వంటి నిరుపయోగ వస్తువులను కాలువల్లో పారబోయడాన్ని గమనించామన్నారు. ఇక నుండి ఇటువంటి చర్యలకు స్వస్తిపలికి మెరుగైన ప్రజారోగ్యానికి సహకరించాలని సూచించారు.

ముగిసిన పశుగ్రాస వారోత్సవాలు

ప్రజాశక్తి- వేపాడ

మండలంలో పశుగ్రాస వారోత్సవాలు సోమవారం ముగిశాయి. చివరి రోజు నల్లబిల్లి గ్రామంలో పాడి రైతులకు పశుగ్రాసం పెంపకం వల్ల కలిగే లాభాలు, పశుగ్రాస ప్రాముఖ్యత, పశుగ్రాస పెంపకం కోసం గవర్నమెంట్ అందిస్తున్న పథకాలు మీద పశు వైద్యాధికారి కోరాడ గాయత్రి అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా గ్రామంలో ఉచిత పశుగర్భకోస, ఆరోగ్య శిబిరం నిర్వహించి 25 మంది పాడి రైతులకు చెందిన 32 పశువులకు వైద్య సేవలు అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

లక్కవరపుకోట: ఈ నెల 13న జమ్మాదేవిపేట సమీపాన ఆర్ అండ్ బి బంగ్లా వద్ద ఎస్ కోట నుంచి వస్తున్న కారు బైకును ఢీకొంది. ఈ ప్రమాదంలో ఎల్ కోట సీతారాంపురం గ్రామానికి చెందిన తూర్పాటి లోకేష్(42) తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు 108 సహాయంతో ఎస్‌కోట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నం విమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మధ్యాహ్నం మృతి చెందినట్లు ఎఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. మృతునికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారని కేసు నమోదు చేశామని చెప్పారు.

బ్యాటరీ పేలి రెండు ఎలక్ట్రికల్ స్కూటీలు దగ్ధం

బొబ్బిలి: పట్టణంలోని సిరిపురపువీధిలోని ఎలక్ట్రిక్ స్కూటీ బ్యాటరీ పేలి రెండు ఎలక్ట్రిక్ స్కూటీలు దగ్ధమయ్యాయి. పేపర్ బాయ్‌గా పని చేస్తున్న రమేష్‌కు రెండు ఎలక్ట్రిక్ స్కూటీలు ఉన్నాయి. పనులు ముగించుకుని సోమవారం ఇంటి ముందు స్కూటీని పార్కింగ్ చేశారు. పార్కింగ్‌లో ఉన్న స్కూటీ బ్యాటరీ పేలడంతో నిప్పులు చెలరేగి పక్కనే పార్కింగ్‌లో ఉన్న మరో స్కూటీకి నిప్పు అంటడంతో రెండూ దగ్ధమయ్యాయి. వెంటనే రమేష్ మంటలను నీటితో అదుపుచేశారు. పార్కింగ్‌లో ఉన్న సమయంలో బ్యాటరీ పేలడంతో ఎటువంటి ప్రమాదం జరగలేదని రమేష్ తెలిపారు.

మూడు ఇసుక ట్రాక్టర్లకు జరిమానా

గజపతినగరం రూరల్: మండలంలోని ఎం.గుమ్మడం గ్రామంలో చంపావతి నది నుంచి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న, మూడు ట్రాక్టర్లు యజమానులపై సోమవారం తహశీల్దార్ రత్న కుమార్ ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో సీతారాంపురం గ్రామానికి చెందిన ఐ.గోవింద, ములకాల గుమ్మడం గ్రామానికి చెందిన ఆవాల రాము, పట్నాల తవుడులు తమ టాక్టర్లు ద్వారా అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్నట్లు గుర్తించారు. ఈ మేరకు మొదటిసారి దొరికిన మూడు ట్రాక్టర్లకు ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున జరిమానా విధించినట్లు తహశీల్దార రత్నకుమార్ ప్రజాశక్తికి తెలిపారు. ఉచిత ఇసుక పాలసీ అమల్లో ఉన్నప్పటికీ తప్పనిసరిగా సంబంధిత సచివాలయంలో అనుమతులు తీసుకోవాలని తెలిపారు.

మహారాజశ్రీ విజయనగరం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
S.O.P 6/2025

Between :
1. Smt. Ainada Kannamma, W/o Veerappa, R/o Gopalapalli Village, S.Kota Mandal, Viziangaram District.
2. Chi. Ainada Vishnu Vardhan, S/o late Seetha Babu Rest - do -
And :
State Bank of India. Rep by its Branch Manager, Dharmavaram, S.Kota Mandal, Vizianagaram - (IFSC: SBIN0002709)
.....Respondent

General Notice

ఇందలి పిటిషనర్లు పై కోర్టులో శ్రీమతి Ainada Lakshmi W/o late Seetha Babu వారసులు అని Succession Certificate జారీ చేయాలని కోరుచూ పిటిషన్ దాఖలు చేశారు. Ainada Lakshmi పేరున పైన తెలిపిన బ్యాంకులో లైఫ్ ఇన్స్యూరెన్స్ పాలసీ సొమ్ము పొందుటకు ఆమె వారసులని Succession Certificate కోసం దాఖలు చేసినారు. ఎవరికైనా ఎటువంటి ఆక్షేపణలు ఉన్న ఎడల స్వయంగా గాని, లాయరు ద్వారా గాని పై కోర్టులో **తే 04-08-2025దీన ఉదయం 10-30 గంటలకు** హాజరై తెలపవలెను. లేనిచో వున్న ఆధారాల మేరకు పరోక్షంగా తీర్మానం జరుగునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

By Court Order

వర్రి దేముడుబాబు
ఈర్లి ఈశ్వరరావు
పిటిషనర్లు తరుపు న్యాయవాది
విజయనగరం,
సెల్ : 9440237075

పబ్లికేషన్
మహారాజశ్రీ బొబ్బిలి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జికోర్టు వారి దివ్యసముఖమునకు
I.A.555/2022 IN O.S.253/2022

పడాల సత్యన్నారాయణ రెడ్డి........పిటిషనరు/వాది
ఎండ్:
చిర్ల వరలక్ష్మి వగైరాలు ....రెస్పాడెంట్లు/ప్రతివాదులు

ఆర్ 2. చిర్ల వనితారెడ్డి తండ్రి లేటు సాంబశివారెడ్డి, వయస్సు 26 సంIIలు, గౌడవీధి, బొబ్బిలి, విజయనగరం జిల్లా.

ఆర్ 4. చిర్ల ఆదిలక్ష్మి తండ్రి సత్యన్నారాయణ రెడ్డి వయస్సు 68 సంIIలు, గౌడవీధి, బొబ్బిలి, విజయనగరం జిల్లా.

పై నెంబరు దావాలోని పిటిషను ఐ.ఎ.555/2022 అను ఎటాచ్మెంటు పిటిషను దావా షెడ్యూలు ప్రోపర్టీని ఎటాచ్ చేయమని పిటిషను దాఖలు చేసియున్నాను. సదరు పిటిషను వాయిదా **తేదీ. 18-07-2025** కి వాయిదా అయి వున్నది. సదరు వాయిదా దినం పై కోర్టులో **ఉదయం 10.30 గంIIల**కు స్వయంగా గాని వకీలు ద్వారా గాని పై కోర్టులో హాజరు కావలెయును లేని యెడల మీ పరోక్షమందు. తీర్మాణించబడునని యిందు మూలంగా తెలియజేయడమైనది.

జై ఆర్డరు

కండాపు ప్రసాదరావు
వాది తరుపు అడ్వకేట్
బొబ్బిలి

బొబ్బిలి,
తేది: 15-07-2025

పబ్లికేషన్
మహారాజశ్రీ బొబ్బిలి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జికోర్టు వారి దివ్యసముఖమునకు
O.S.253/2022

పడాల సత్యన్నారాయణ రెడ్డి ....వాది
ఎండ్:
చిర్ల వరలక్ష్మి వగైరాలు ....ప్రతివాదులు

డి2. చిర్ల వనితారెడ్డి తండ్రి లేటు సాంబశివారెడ్డి, వయస్సు 26 సంIIలు, గౌడవీధి, బొబ్బిలి, విజయనగరం జిల్లా.

డి4. చిర్ల ఆదిలక్ష్మి తండ్రి సత్యన్నారాయణ రెడ్డి వయస్సు 68 సంIIలు, గౌడవీధి, బొబ్బిలి, విజయనగరం జిల్లా.

పై నెంబరు దావాలో యిందలి ప్రతివాదుల పై సోమ్ము రాబట్టే నిమిత్తం దావా దాఖలు చేసియున్నారు. సదరు దావా వాయిదా **తేది.18-07-2025** కి వాయిదా అయి వున్నది. సదరు వాయిదా దినం పై కోర్టులో **ఉదయం 10.30 గంIIలకు** స్వయంగా గాని వకీలు ద్వారా గాని పై కోర్టులో హాజరు కావలియును లేని యెడల మీ పరోక్షమందు తీర్మాణించబడునని యిందు మూలంగా తెలియజేయడమైనది.

జై ఆర్డరు

కండాపు ప్రసాదరావు
వాది తరుపు అడ్వకేట్
బొబ్బిలి

బొబ్బిలి,
తేది: 15-07-2025